క్లుప్తంగా

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలుశాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కేవీ రత్నకుమార్, మంతెన మూర్తిరాజు, ఎ.కృష్ణచైతన్య, కేఎస్‌వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు మునగ మొక్కలు

తాళ్లపూడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం మొక్కలు పంపిణీ చేశారు. వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఎంఈవో సీహెచ్ బాలామణి, సీహెచ్ నెహ్రూజీ చేతుల మీదుగా 100 మునగ మొక్కలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ నెల ఏడో తేదీన పేరెంట్స్ కమిటీ సమావేశం రోజున పాఠశాలల్లో ఈ మొక్కలు నాటాలని సూచించారు.

ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలి



విద్యుత్ సౌకర్యం కల్పించాలంటూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన మహిళలు

తాళ్లపూడి: తమ గృహాలకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరుతూ అన్నదేవరపేట సమీపంలోని సూరయ్యపేట లేఅవుట్ వాసులు ఏడుగురు సోమవారం తాళ్లపూడిలో తహసీల్దార్ బి.రవీంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. వారంతా గత ప్రభుత్వం నుంచి ఉచితంగా స్థలాలు పొంది ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు. నేటికీ ప్రభుత్వం ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వక పోవడంతో ఆందోళన చేస్తున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు భవాని, హైమావతి, దుర్గ, పోశమ్మ, వెంకటలక్ష్మి, దుర్గాభవాని తదితరులు మాట్లాడుతూ ఏడాది క్రితం తాము ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నామన్నారు. అప్పటి నుంచీ తమకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పథకం నిలిచిపోయిందని, విద్యుత్ కనెక్షన్లు కావాలంటే రూ.6 వేలు చెల్లించాలని అధికారులు అంటున్నారని వాపోయారు.


ఘనంగా నంగాలమ్మ ఆలయ వార్షికోత్సవం



నంగాలమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి కన్నబాబు, స్థానిక నాయకులు

నిడదవోలు రూరల్: మండలంలోని సెట్టిపేట గ్రామదేవత నంగాలమ్మ వారి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ కురసాల నెహ్రూ పర్యవేక్షణలో భారీ అన్నసమారాధన నిర్వహించగా పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జద్దు శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కురసాల సత్యనారాయణ, రావి శ్రీనివాసరావు, కురసాల వంశీ పాల్గొన్నారు.

'కాకర్ల 'ను పరామర్శించిన తలారి



కాకర్ల లక్ష్మి చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి, పార్టీ నాయకులు

తాళ్లపూడి: మాతృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావును మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు, పార్టీ మండల నాయకులు సోమవారం పరామర్శించారు. పోచవరానికి చెందిన కాకర్ల వెంకటేశ్వరరావు తల్లి కాకర్ల లక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే తలారితో పాటు ఆ పార్టీ మండల నాయకులు సోమవారం పోచవరం వెళ్లి కాకర్ల తల్లి లక్ష్మి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, మండల సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి పరశురామారావు, పిట్టా శ్రీనివాస్, సర్పంచులు గండి రాంబాబు, తిగిరిపల్లి వెంకట్రావు, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, కొయ్యే దుర్గారావు, దాకే రాజు ఉన్నారు.

అధిక లోడుతో వెళుతున్న ఆరు ఇసుక లారీల సీజ్

కొవ్వూరు: అధిక లోడుతో వెళుతున్న ఆరు ఇసుక లారీలను సోమవారం సాయంత్రం సీజ్ చేసినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పట్టణ శివారు గామన్ ఇండియా రోడ్డు జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా సామర్థ్యానికి మించి ఇసుక తరలిస్తున్న ఆరు లారీలను సీజ్ చేసినట్టు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం కొవ్వూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు నివేదిక పంపినట్టు చెప్పారు.



ఖండవల్లి వద్ద రోడ్డుపై ధాన్యపు రాశులు



పిట్టల వేమవరంలో నేలనంటిన వరిపైరు

అన్నదాతకు ఆపద

- ఆదుకుంటామనే ప్రకటనకే ప్రభుత్వం పరిమితం
- తడిసిన ధాన్యం సేకరణకు ముందుకు రాని మిల్లర్లు
- దళారీలకు దాసోహం అంటున్న రైతులు
- ఫెంగల్ తుపానుతో పరిస్థితి దయనీయం

పెరవలి: పంట ఇంటికొచ్చే వేళ అన్నదాతకు ఆపదొచ్చింది. ఎక్కడో తమిళనాడులో ఏర్పడిన ఫెంగల్ తుపాను ప్రభావంతో ఇక్కడా వర్షాలు కురిశాయి. రైతులు రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంట కళ్లాల్లోనూ, రోడ్లపైనా ఉండిపోయింది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం మాటలకే పరిమితం అయ్యింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం సాయంత్రం వరకూ ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ఖరీఫ్ పంట మాసూళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దానికితోడు గురు, శుక్రవారాలు మాసూళ్లు చేసిన ధాన్యం పొలాల్లో రాశులుగా ఉండిపోయింది. ఆదుకోవాలంటూ రైతులు ప్రభుత్వం వైపు దీనంగా చూస్తున్నారు. రెండు రోజులపాటు కురిసిన వర్షాలకు రాశుల్లోని ధాన్యం ఆవిరికి ఇప్పటికే ముక్కు,బూజు పడుతోందని రైతులు చెబుతున్నారు. మరోపక్క కోత కోయని వరిచేలు ఈదురు గాలులకు నేలనంటాయి. పండిన పైరు నేరకొరగడం వల్ల ధాన్యం దిగుబడులు తగ్గుతాయని కర్షకులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ ధాన్యంలో తేమశాతం 25 వరకూ ఉన్నప్పటికీ అభ్యంతరం చెప్పకుండా కొనుగోలు చేస్తారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. క్షేత్ర స్థాయిలో ఆ ఆదేశాలు అమలు కావడం లేదని నిడదవోలు నియోజకవర్గ రైతులు వాపోతున్నారు. పర్యవసానంగా రైతులు తమ ధాన్యాన్ని అయిన కాడికి దళారీలకు అమ్ముకోవలసిన దుస్థితి ఏర్పడింది.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటికీ 45 శాతం విస్తీర్ణంలో ఖరీఫ్ వరికోతలు జరగాల్సి ఉంది. ఈ చేలన్నీ కూడా కోతకు సిద్ధంగా ఉన్నవే. అకాల వర్షాల వలన రైతులు వాయిదా వేసుకున్నారు. నియోజకవర్గంలో 36,500 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేయగా, 22,500 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. మిగిలిన 14 వేల ఎకరాల్లో పంట కోయవలసి ఉంది. మాసూళ్లు పూర్తయి, ధాన్యం రాశుల్లో, బస్తాల్లో నిల్వ ఉన్న ధాన్యం నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 1,500 మెట్రిక్ టన్నులు ఉన్నట్టు అధికారుల అంచనా. పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల అధికారులు శనివారం పలు మండలాల్లోని వివిధ గ్రామాలను సందర్శించారు. రోడ్లపై ఉన్న ధాన్యం రాశులను పరిశీలించి వెంటనే మిల్లులకు తరలించాలంటూ ఆదేశాలైతే ఇచ్చారు. అయితే మిల్లులకు ధాన్యం తరలింపులు మాత్రం అంతంత మాత్రంగానే జరిగాయి. చాలా గ్రామాల్లో ఎక్కడి ధాన్యం అక్కడే ఉండిపోయింది. పెరవలి మండలంలోని పుంత గట్లపైన, చేలల్లో, రోడ్లపైన ధాన్యం రాశులు ఇప్పటికీ దర్శనం ఇస్తూనే ఉన్నాయి.



అన్నవరప్పాడులో పొలం నుంచి ధాన్యం బస్తాలు తెస్తున్న కూలీలు

గాలులకు పడిపోయిన పైరు

ఫెంగల్ తుపాను ప్రభావంతో వీచిన ఈదురుగాలులు, వర్షాలకు సుమారు వెయ్యి ఎకరాల్లోని వరి పైరు నేల నంటింది. పెరవలి మండలంలోని పిట్టల వేమవరం, అన్నవరప్పాడు, ఖండవల్లి, కాపవరం, పెరవలి, కాకరపర్రు, అజ్జరం గ్రామాల్లో వరి చేలు గాలులకు నేలనంటాయి. దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. మరోపక్క మాసూళ్లు పూర్తయిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని అధికారులు ప్రకటనలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. గతంలో తుపాను వస్తే అధికారులు పొలంగట్ల వెంబడి తిరిగి, అప్పటికప్పుడు ధాన్యాన్ని మిల్లులకు తరలించేవారని పేర్కొంటున్నారు. నేడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అయిన కాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి

ధాన్యంలో తేమశాతం 17 శాతానికి మించినప్పటికీ కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఆదేశాలను మిల్లర్లు పట్టించుకోవడం లేదు. తేమ శాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వారు నిరాకరిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. దీంతో రైతులు తమ ధాన్యాన్ని మరోదారి లేక దళారీలకు అమ్ముకోవలసిన దుస్థితి ఏర్పడింది. నాణ్యతను బట్టి 75 కిలోల బస్తా రూ.1350 రేటుకు కాస్తా అటూఇటూగా దళారీలు కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పోలిస్తే రైతులు బస్తా ఒక్కింటికి రూ.300 నుంచి రూ.350 వరకూ నష్టపోతున్నారు.

పంట నేలనంటింది



రెండున్నర ఎకరాల పొలం కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. పంట బాగానే పండింది. పైరు కోయిద్దామనుకు నేలోగా వర్షం మొదలవడంతో ఆపేశాను. పంట బాగా పండి, పూర్తిగా ఎండి పోవడంతో గాలులకు నేలనంటింది. దిగుబడి తగ్గిపోతుంది. ఎంతోకొంత మిగులుతుంది అనుకుంటే నష్టం వచ్చేలా ఉంది.

– సకిలే పెద్ద సూర్యారావు, కౌలు రైతు, పిట్టల వేమవరం

ధాన్యం పూర్తిగా ఆరాక తెమ్మంటున్నారు



కోత కోసినప్పటికీ ధాన్యం అమ్మలేకపోయాను. ధాన్యం రోడ్డు మీదకు తెచ్చిన వెంటనే వర్షం రావడంతో రాశి చేసి జాగ్రత్తలు తీసుకున్నాను. అయినప్పటికీ తడిసిపోయింది. శాంపిల్ ధాన్యం మిల్లుకు తీసుకువెళితే పూర్తిగా ఎండిన తర్వాత తీసుకువస్తే కొనుగోలు చేస్తామన్నారు. స్థానిక వ్యాపారులకు విక్రయిద్దామంటే రేటు బాగా తగ్గించి అడుగుతున్నారు. ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు.

– కొవ్వూరు హనుమంతరెడ్డి, పిట్టల వేమవరం

చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

పేదలకు వస్త్రాలు, దుప్పట్ల పంపిణీ



సంఘ కాపరులకు నూతన వస్త్రాలు అందిస్తున్న జాన్‌వెస్లీ, రాబిన్ పాల్

నల్లజర్ల: ప్రకాశరావుపాలెంలోని లూథరన్ చర్చిలో ఆదివారం రాత్రి ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి రెవరెండ్ మరపట్ల ప్రసాద్ అధ్యక్షత వహించారు.క్రైస్తవుడంటే ప్రత్యేక గుణగణాలు కలిగిన వ్యక్తిగా అందరికీ ఆదర్శనీయంగా ఉండాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ క్రైస్తవులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవుల సంక్షేమానికి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.416 కోట్లు ఖర్చుచేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మరో ముఖ్యఅతిథి డాక్టర్ కందవల్లి రాబిన్‌పాల్ మాట్లాడుతూ ప్రతి క్రైస్తవునిలో ప్రేమ, దయ, జాలి, కరుణ, సమర్పణ ఉండాలన్నారు.ఆయన ఆర్థిక సాయంతో సంఘ కాపరులకు నూతన వస్త్రాలు బహూకరించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

జియో ట్యాగింగ్ త్వరితగతిన పూర్తిచేయాలి

నిడదవోలు రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించేందుకు సచివాలయ ఉద్యోగులంతా తమ క్లస్టర్ పరిధిలోని కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని జియో ట్యాగింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో జియో ట్యాగింగ్ ప్రక్రియపై సచివాలయ ఉద్యోగులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రతి ఇంటి వివరాలు సేకరించి ఫొటో తీసి యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తిక సందడి

- చివరి రోజు గోష్పాద క్షేత్రానికి పోటెత్తిన భక్తులు
- పోలి స్వర్గంతో ముగిసిన కార్తిక మాసం

కొవ్వూరు: పవిత్ర కార్తిక మాసం సోమవారంతో ముగిసింది. చివరిరోజు కావడంతో సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో స్థానిక గోష్పాద క్షేత్రానికి చేరుకున్నారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్నానఘట్టంలో కార్తిక దీపారాధనలు చేశారు. స్నానఘట్టంలోని శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు.

నదిలో కార్తిక దీపాలు విడిచిపెట్టారు. అనంతరం సుందరేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. పోలి స్వర్గంతో కార్తిక మాసం ముగిసింది. పట్టణంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి, పంచాయతన శివాలయం, పాతూరిలోని ఉమా చోడేశ్వరస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు పరమ శివుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు.



కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి నదిలో స్నానాలు, పూజలు ఆచరిస్తున్న భక్తులు

పోలి దీపాలు వదిలిన మహిళలు

పెరవలి: అమావాస్య, పోలి పాడ్యమి సందర్భంగా మహిళలు సోమవారం కాలువల్లోను, చెరువుల్లోనూ కార్తిక దీపాలు వదిలారు. తెల్లవారుజామునే శైవ, వైష్ణవాలయాలకు చేరుకుని పూజల అనంతరం కార్తిక దీపాలు విడిచారు. అనంతరం శివాలయాల్లో అర్చకులు చెప్పిన పోలిస్వర్గం కథను భక్తి శ్రద్ధలతో విన్నారు.

గోలింగేశ్వరునికి మంత్రి పూజలు

నిడదవోలు: పట్టణంలోని పురాతన గోలింగేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తిక మాసం చివరి రోజైన సోమవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో నామా సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు మంత్రి దుర్గేష్‌ను ఆలయ మర్యాదలతో సత్కరించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయ కోనేరులో పోలి దీపాలు వదులుతున్న మహిళలు

సంక్షిప్తంగా...

ఇసుక తవ్వకాలను అనుమతి ఇవ్వాలి

పెరవలి: ఇసుక తవ్వకాలు నిలిచిపోవడంతో పనులు లేక సుమారు 800 కుటుంబాలు పస్తులుండే పరిస్థితి ఏర్పడిందని ఇసుక తవ్వకం కూలీలు మంత్రి కందుల దుర్గేష్‌కు మొరపెట్టుకున్నారు. ఉసులుమర్రు ఇసుక కూలీల యూనియన్ ప్రెసిడెంట్ బట్టు మోహన్, కూలీల మేస్త్రీలు ఆకుల అయ్యప్ప, బట్టు శేఖర్, శీలంశెట్టి కాళి, కాకర రాంప్రసాద్, జన్ని సునీల్ సోమవారం మంత్రిని కలసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇప్పించాలని కోరారు.

జీఓ. నంబర్ 117ను రద్దు చేయాలి

నల్లజర్ల: ప్రభుత్వ విద్యా రంగానికి గొడ్డలి పెట్టుగా ఉన్న జీఓ నంబర్ –117ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ కోరారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా బరిలో ఉన్న బొర్రా గోపిమూర్తికి మద్దతుగా సోమవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులను జయకర్ కలుసుకున్నారు. మొదటి ప్రాధాన్యతా ఓటు గోపిమూర్తికి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్‌ల పేరుతో బోధనేతర కార్యక్రమాలు మోపుతున్న విద్యాశాఖ అధికారులను అడ్డుకోవాల్సి ఉందన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి

నిడదవోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేలు, వివిధ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి పని ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు మొరపెట్టుకుంటున్నారు. వేళాపాళాలేని సమయంలో వీడియో కాన్ఫరెన్స్‌లు, సమీక్ష సమావేశాలు నిర్వహించొద్దని కోరుతూ నిడదవోలు మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనాలి

చాగల్లు: తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా రైతుసంఘం కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని ధాన్యం కళ్లాల వద్దే కొనుగోలు చేసే వాటిని నేరుగా రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లుల వద్దకు తరలించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిధాన్యం గింజ కొంటామని తేమశాతం 25 ఉన్న ధాన్యం కొంటామని మంత్రి మనోహర్ చేసిన వ్యాఖ్యలు ప్రకటనకే పరిమితం అవుతున్నాయని విమర్శించారు. మినప, వేరుశనగ పంటలు కోసి పొలంలోని ఉన్నా యని వాటిని ప్రభుత్వం రైతు సేవా కేంద్రం ద్వారా కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

4న ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి పంపిణీ

- జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు
- ఆర్వోలతో సమీక్ష

కొవ్వూరు: ఈనెల 5న నిర్వహించే ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సామగ్రిని నాలుగో తేదీ ఉదయం రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో పంపిణీ చేస్తారని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ఆర్వోలకు సోమవారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో జేసీ సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల లోపల, బయట బందోబస్తుకు రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటుకు మ్యాప్‌లను సిద్ధం చేయాలని ఆదేశించారు. పోలింగ్ నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు పూర్తి అధికారం కలిగి ఉంటారన్నారు. చెక్ లిస్టు ప్రకారం సంబంధిత అధికారులు, ఆయా పోలింగ్ సిబ్బందికి, అధికారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సూచించారు. ఆర్డీవో రాణి సుస్మిత, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు,ఆర్వోలు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

పోలీసుల అదుపులో ముగ్గురు విటులు, ఇద్దరు మహిళలు

కొవ్వూరు: స్థానిక సత్యవతీ నగర్‌లోని ఆర్ ఆర్ టౌన్ షిప్‌లో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. ముగ్గురు విటులు, ఇద్దరు మహిళలతో పాటు నిర్వాహకుడిని అరెస్ట్ చేసినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. ఆటో డ్రైవర్‌గా పనిచేసే రాజమహేంద్రవరం సీటీఆర్ఐ ప్రాంతానికి చెందిన మద్దిపాటి నాగేశ్వరరావు కొవ్వూరులో ఇల్లు అద్దెకు తీసుకుని వివిధ ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వ హిస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఆకస్మికంగా దాడి జరిపి, వ్యభిచారం చేస్తున్న ముగ్గురు విటులను, ఇద్దరు యువతులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన బత్తిన దుర్గాప్రసాద్, పట్టణానికి చెందిన తాతోలు గవరాచార్యులు, శాఖమూరి హరి సాయి మోహన్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు.

పరిష్కార వేదికకు మూడు అర్జీలు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అర్జీలను తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలని ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వ హించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. నిర్దేశించిన సమయంలోగా ప్రతి అర్జీని పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. సోమవారం మూడు అర్జీలు అందినట్లు తెలిపారు.

డిగ్రీ కళాశాల స్థలాన్ని పరిశీలించిన ఆర్జేడీ



డిగ్రీ కళాశాలకు కేటాయించి స్థలంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న శోభారాణి

కొవ్వూరు: మునిసిపల్ వాటర్ వర్క్స్‌కు చెందిన పట్టణంలోని 4.48 ఎకరాల భూమిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణాలకు కేటాయించారు. ప్రభుత్వ కళాశాలల రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ ఎస్.శోభారాణి (రాజమహేంద్రవరం) ఈ స్థలాన్ని సోమవారం ఇక్కడకు వచ్చి పరిశీలించారు. స్థలానికి సంబంధించిన వివరాలను ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ స్థలంలో భవనాల నిర్మాణానికి రూ.30 కోట్లు ఖర్చవుతుందని, ఈ మేరకు డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్) గత ప్రభుత్వానికి పంపించామని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. కాగా ఈ భూమిని తిరిగి మునిసిపాలిటీ స్వాధీనం చేసుకునేందుకు వీలుగా ఇటీవల మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం కూడా చేశారు. తమ స్థలాన్ని తమకు స్వాధీనపరచాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌తో పాటు ఆర్జేడీకి లేఖలు పంపారు. ఈ మేరకు ఆర్జేడీ సోమవారం కొవ్వూరు విచ్చేసి భవన నిర్మాణాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు.

దివ్యాంగుల జీవితాల్లో తేజం

- అక్కున చేర్చుకుంటున్న భాస్కరుడు
- కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఏర్పాటు
- విస్తరిస్తున్న ఆశ్రమం సేవలు
- నేడు దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా..

దేవరపల్లి: అనాథ దివ్యాంగులను అక్కున చేర్చుకుని ఆశ్రయం కల్పిస్తున్నారు దేవరపల్లికి చెందిన దివ్యాంగుడు కాగిత భాస్కరరావు. ఉభయ గోదావరి జిల్లాల్లో అంగవైకల్యం, మానసిక వైకల్యంతో బాధపడుతున్న అనాథ పిల్లలను గుర్తించి ఆశ్రమంలో ఉచిత విద్య, వసతి కల్పిస్తున్నారు. భాస్కరరావు చేస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం, స్వచ్ఛంద సేవాసంస్థలు అవార్డులు అందజేసి సత్కరించారు. 2016లో సాక్షి ఎక్సలెన్స్ ఆన్ సోషల్ డెవలప్‌మెంట్ అవార్డు అందుకున్నారు. 2017లో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారం అందజేసింది. పుట్టిన గ్రామంలో తన సేవలు నిర్వహించాలనే సంకల్పంతో 2007లో దేవరపల్లిలో లగడపాటి రామలక్ష్మమ్మ రామానాయుడు దివ్యాగుల ఆశ్రమ పాఠశాలను కాగిత భాస్కరరావు నెలకొల్పి అనాథ పిలలకు విద్య, వసతి సౌకర్యం కల్పించారు. ఇరుకు ఇంటిలో పాఠశాల నిర్వహణ కష్టంగా ఉండడంతో ఆశ్రమం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ విజయలక్ష్మిని కలిసి ఆశ్రమ పాఠశాల ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని కోరారు. దీంతో మండలంలోని బందపురం పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం వద్ద 80 సెంట్లు ఆశ్రమం ఏర్పాటుకు కేటాయించారు. అనంతరం దాతల సహకారంతో ఆశ్రమ భవనాన్ని నిర్మించారు. దివ్యాంగ పిల్లలకు విద్యతో పాటు క్రీడలు, చేతి వృత్తుల్లో శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆశ్రమంలో 26 మంది దివ్యాంగులు ఆశ్రయం పొందుతున్నారు. తనతో పాటు భార్య, కుమారుడు, కుమార్తె, కుటుంబ సభ్యులు ఆశ్రమంలో సేవలు అందిస్తున్నారు. 2015లో దివ్యాగుల ఆశ్రమం ప్రాంగణంలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి ఉభయ గోదావరి జిల్లాల్లోని పలువురు వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. ఆశ్రమంలో 40 మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. ఆశ్రమం వద్ద భాస్కరరావు కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం (సర్జికల్స్, ఆర్టిఫిషియల్ లింబ్స్ సెంటర్) ఏర్పాటు చేశారు. కేంద్రాన్ని ఇటీవల ప్రారంభించి దివ్యాగులకు కృత్రిమ కాళ్లు, చేతులు సమకూరుస్తున్నారు. వృద్ధులకు అవసరమైన చేతికర్రలు, వీల్ ఛైర్స్, సంకకర్రలు, వాకర్స్ వంటి పరికరాలను అందుబాటులో ఉంచారు.



దేవరపల్లిలోని ఆశ్రమంలో భోజనాలు చేస్తున్న అనాథ దివ్యాంగులు



'సాక్షి' ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న కాగిత భాస్కరరావు (ఫైల్)

రెండు దశాబ్దాలుగా..



గత 20 ఏళ్లుగా నా కుటుంబ సభ్యులంతా దివ్యాంగులు, వృద్ధుల సేవలో ఉన్నాం. ఉచిత విద్య, వసతితో పాటు చేతివృత్తుల్లో శిక్షణ ఇస్తున్నాం. కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలనే తన లక్ష్యం నెరవేరింది. ఆశ్రమంలో దివ్యాగులు, వృద్ధులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఉన్నాయి. దాతల సహకారంతో ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు వందలాది దివ్యాగులకు ఆశ్రమం పొందారు. ప్రభుత్వ సహకారం లేకపోయినా దాతల సహకారం ఉంది.

– కాగిత భాస్కరరావు, ఆశ్రమం వ్యవస్థాపక చైర్మన్, గొల్లగూడెం, దేవరపల్లి మండలం